క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



మన్ననూర్: మండలంలో జంగిరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అమ్రాబాద్ ఎంపీడీఓ లింగయ్య ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇసుక, సిమెంటు, స్టీలు లబ్ధిదారులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. మూడు నెలల వ్యవధిలో ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనారోగ్యం

లింగాల: మత్తు పదార్థాలతో అనారోగ్యం బారిన పడుతారని ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు అన్నారు. ఈ నెల 26న నిర్వహించే మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకుంటే మతిమరుపు, బుద్ధిమాంద్యం కలుగుతుందన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం దారుణం


మన్ననూర్: వికారాబాద్ జిల్లా పుట్టపహాడ్‌లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకుడు సంబు వెంకటరమణ, కొండూరు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన



అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని ఏఓ అమృద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. అర్హులందరికీ పథకం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ఏలేందర్, రాజు, రవి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దండునర్సింహను సోమవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగబాబు, ఉదయ్‌కుమార్, శివప్రసాద్, రసూల్, చెన్నకేశవులు, సాయిశంకర్, మల్లేష్, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బూట్లు పంపిణీ

బిజినేపల్లి: ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా మండలంలోని వట్టెం బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బూట్లను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బత్తిని అమృతరెడ్డి 100 మందికి బూట్లను సమకూర్చగా ఎంఈఓ రఘునందన్‌రావు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కుబడిగా ‘ప్రజావాణి’

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- పట్టించుకోని అధికారులు



అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో హాజరైన వివిధ శాఖల అధికారులు

అచ్చంపేట రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే ‘ప్రజావాణి’ నియోజకవర్గంలో మొక్కుబడిగా సాగుతోంది. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు అన్ని శాఖల అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్న కలెక్టర్ ఆదేశాలు అమలు కావడం లేదు. స్థానికంగా ఉండని అధికారులు వివిధ ప్రాంతాల నుంచి హడావుడిగా తహసీల్దార్ కార్యాలయాలకు ఆలస్యంగా వస్తున్నారు. మరికొందరు అధికారులు దుమ్మా కొడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాదని భావించి జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. దీంతో మండలంలో నిర్వహించే ప్రజావాణికి ఫిర్యాదులు కరువయ్యాయి. ఒకటి, రెండు ఫిర్యాదులతో సరిపుచ్చుకుంటున్నారు. కొన్ని మండలాల్లో నిర్వహించే ప్రజావాణికి అసలు ఒక్క ఫిర్యాదు కూడా రాని రోజులు ఉన్నాయి. దీనిబట్టి చూస్తే అధికారులు ఏ స్థాయిలో పనిచేస్తున్నారో అర్థమవుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్క రోజు సెలవు ఉంటే చాలు అధికారులు ఒకరోజు ముందే విధులకు దుమ్మాకొడుతున్నారు. దుమ్మాకొట్టే అధికారులంతా వేరే పట్టణాల్లో స్థిరపడి రోజువారీగా విధులకు హాజరవుతున్నవారే ఉన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా నామమాత్రంగా ఉండటంతో కింది స్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం అచ్చంపేటలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సైదులు ఉదయం 11 గంటలకు హాజరైనా మండల స్థాయి వివిధ శాఖల అధికారులు హాజరు కాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపిస్తున్నారు. వ్యవసాయ, ఐసీడీఎస్, విద్యుత్, మండల పరిషత్ కార్యాలయం నుంచి కిందిస్థాయి అధికారులు మాత్రమే హాజరయ్యారు. మొత్తం 15 పైగా శాఖలకు గాను మొత్తం 4 శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరుకావడం గమనార్హం. అచ్చంపేటలో ఒక్క దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ సైదులు తెలిపారు. హాజరు కాని, నిర్లక్ష్యం వహించే అధికారులకు మెమోలు జారీ చేసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణిని ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్, ఇన్‌చార్జ్ ఏడీఈ ఆంజనేయులు, ఏఓ కృష్ణయ్య, ఆర్ఐ బాల్‌రాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలకు ప్రాధాన్యం



తోటపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి రూరల్: ప్రజల సౌకర్యార్థం రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముకురాల, గుండూరు, తురకలపల్లి, తోటపల్లి తదితర గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, రోడ్లపై బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.23 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని తోటపల్లి నుంచి తర్నికల్ గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, తోటపల్లి అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.8లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. రహదారులు అభివృద్ధి చెందితే అన్ని విధాల అభివృద్ధి సాధ్యమన్నారు. మండలంలోని ముకురాలలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఎగురవేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ బాలాజీసింగ్, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుమ్మకొండ రాములు, మాజీ జెడ్పీటీసీ అశోక్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, పవన్ కుమార్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సంజీవ్ యాదవ్, తోటపల్లి రాజేష్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, హరీష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, శివ, అంజి, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందిస్తున్న వాసుదేవరావు

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం విద్యాస్వేచ్ఛ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వాసుదేవరావు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్సిల్స్, పలకలను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రసూన, ఉన్నత హెచ్‌ఎం జహంగీర్, హెచ్‌ఎం శ్రీనివాసులు ఉపాధ్యాయులు రజిత, ప్రసన్న, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు సోమవారం హైదరాబాద్ విద్యాస్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ వాసుదేవరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సంస్థ అండగా ఉంటుందన్నారు. హెచ్‌ఎం పావని, శ్రీనివాసులు, జీహెచ్‌ఎం సుగుణ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్, సంతోషి, రాణి, తదితరులు ఉన్నారు.

నేడు రైతు భరోసా విజయోత్సవం

ఉప్పునుంతల: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే రైతు భరోసా విజయోత్సవాలను మంగళవారం సాయంత్రం 5 గంటలకు మండలంలోని ఉప్పునుంతల, మర్రిపల్లి, ఫిరట్వానిపల్లి రైతు వేదికలలో నిర్వహిస్తునట్లు ఏఓ రమేష్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వీసీ ద్వారా సందేశం ఇస్తారని పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

లింగాల: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ అన్నారు. సోమవారం మండలంలోని సూరాపూర్, మాడాపూర్, బాకారం ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రస్తుత సమయంలో పాత విద్యార్థులను త్వరగా పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, కొత్త అడ్మిషన్లపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగే విధంగా పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

యోగాతో శారీరక ధృడత్వం

పెద్దకొత్తపల్లి: యోగాతో శారీరక ధృడత్వం కలుగుతుందని డాక్టర్ కమల్‌రాజ్ అన్నారు. సోమవారం మండలంలోని ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో క్యాశన్ శక్తి వర్మ, రాంచంద్ర మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి రోజు విద్యార్థులు యోగా, ప్రాణయామం, ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, నిహారిక, పాఠశాల చైర్మన్ లింగమ్మ, హెచ్‌ఎం సురేఖ, ఉపాధ్యాయులు ఆర్యా, దేవయ్య,శైలాజ,విజయ,సుదర్శన్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధులతో బోర్లు

మన్ననూర్: షెడ్యూల్డు కులాల రైతులకు ప్రోత్సాహం అందించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా పూర్తి సబ్సిడీతో ఎస్సీ కార్పొరేషన్ నిధులతో ఐదు మంది రైతులకు వ్యవసాయ బోర్లు మంజూరు చేసి సోమవారం వారి పొలాల్లో బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు హన్మంత్ రెడ్డి, రహీం, వెంకటేశ్వర్లు, రాజారాం, సైదులు, శివాజీ, వెంకటయ్య, శ్రీను, తిరుపతి, మధు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వెల్దండ: మండలంలోని పల్గుతండాలో రైతు రామావత్ రాములుకు సంబంధించిన ఆవు విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. ఆవు మేత మేస్తుండగా సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంలో అ క్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ రూ. 60వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

‘శూన్యం’ పుస్తకావిష్కరణ

కందనూలు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో నిర్వహించిన జాతీయ ద్విశత కవి సమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన ఫిజిక్స్ అరుణ్‌కుమార్ రచించిన శూన్యం పుస్తకాన్ని ఏపీ ఎస్‌ఆర్టీ డైరెక్టర్ సీహెచ్ రాజశేఖర్, కళారత్న అవార్డు గ్రహీత కత్తిమండ ప్రతాప్‌లు సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం అరుణ్‌కు మార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈశ్వరీభూషణం, చిట్టేలలిత పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఊర్కొండ: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం సంతోష్ అన్నారు. సోమవారం మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో రైతు వేదికలో మహిళా సంఘాల అధ్యక్షులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సీఆర్పీలు నాగమణి, అప్సర, సీసీలు ప్రభాకర్, సునీల్, గ్రామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్/కందనూలు/తిమ్మాజీపేట: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజక వర్గంలో పలు మండలాల్లో సోమవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, సరిత దంపతులు రక్తదాన శిబిరం ప్రారంభించారు. జిల్లా సగర సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీను ఆధ్వర్యంలో సగర సంఘం సభ్యులు రక్తదానం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేశారు. పలువురు ముఖ్య నాయకు లు శుభాకాంక్షలు తెలియజేశారు. తండ్రి ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, వేద పండితులు ఆశీర్వచనం పొందారు. తిమ్మాజీపేట, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సగరసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లం రాముడు మేస్త్రి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, వెంకట్రామ్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, దానం బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారంపై రైతులతో సమావేశం



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నిర్వాసితులు

చారకొండ: డీఎల్ఐ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంపై సోమవారం కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయంలో రైతులతో దేవాదాయ శాఖ, రెవెన్యూ అధికారుల సమావేశం అయ్యారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్ రెడ్డి, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను నాయక్ హాజరయ్యారు. కమాల్‌పూర్ తండా, సారంబండ తండా, బొమ్మల గుడిసెలు గ్రామాల రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. 1954 సంవత్సరం నుంచి దేవాదాయ శాఖకు సంబంధించి 52 ఎకరాల్లో 53 కుటుంబాలు సాగుచేస్తున్నామని వివరించారు. పరిహారం చెల్లించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ భీముడు నాయక్, నిర్వాసితులు బీందాస్, గోపాల్, భగ్న, రాజు, హరి, తార్య తదితరులు ఉన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సూరాపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

లింగాల: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి పంటను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ భరత్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని సూరాపూర్ శివారులో సాగు చేసిన పత్తి పంటను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉందని, అదే విధంగా భూమిలో తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశిస్తుందన్నారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు క్రిమిసంహారక మందులను తగు మోతాదులో వాడాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను పునఃప్రారంభించిన ఎంఈఓ



పాఠశాలలో ఉపాధ్యాయుడికి సూచనలు చేస్తున్న ఎంఈఓ భాస్కర్‌శర్మ

కోడేరు: మండలంలోని మూడేళ్లుగా మూతబడిన ఈర్లకుంట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ భాస్కర్‌శర్మ పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈర్లకుంట తండాలో మూడేళ్ల కిందట విద్యార్థులు లేక పాఠశాల మూసివేయడంతో గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులతో పాఠశాలను తెరిపించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేట్ పాఠశాలకు పంపించొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నాగ్యనాయక్, ప్రధానోపాధ్యాయులు నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

కందనూలు: మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవితో కలిసి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని, అందరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణలో పాముల సహకారం



పామును ప్రదర్శిస్తున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రకృతి పరిరక్షణలో పాముల సహకారం ఎంతో ఉంటుందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దేవరాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ శివారు ప్రాంతంలో రెడ్ స్యాండ్ పాము(రెండు తలల పాము) సంచరిస్తున్న సమాచారం తెలుసుకొని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు స్నేక్ క్యాచర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉడతనోలు చంటి ఆధ్వర్యంలో పామును పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేజ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ పాము ఇంట్లో ఉంటే డబ్బు బంగారం సిద్ధిస్తుందని కొందరు మాయ మాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అటవీశాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు

కందనూలు/పెద్దకొత్తపల్లి/కల్వకుర్తి రూరల్/మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం భారతీయ జనసంఘ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకొని బీజేపీ జిల్లా కార్యాలయంలో బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ దేశం, ధర్మం, సంస్కృతి, జాతీయవాదానికి స్ఫూర్తిగా ముఖర్జీ నిలిచారని కొనియాడారు. కల్వకుర్తి, అమ్రాబాద్, మన్ననూరులో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పెద్దకొత్తపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు పరశురాం నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల్‌శివుడు, యువమోర్చా కార్యదర్శి నరేష్‌చారి, గన్నోజు బాబీదేవ్, మట్ట నరేష్ గౌడ్, మొగిలి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

కోడేరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని కొల్లాపూర్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11ఏళ్లలో ప్రధాని నరేంద్రమోదీ పేదల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లింగన్‌గౌడ్, దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐకాన్ అవార్డు ప్రదానం

చారకొండ: మండలంలోని జేపల్లి గ్రామానికి చెందిన వెల్జాల వెంకటేష్‌కు సేవా ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు కరోనా సమయంలో గ్రామంలో ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా విశ్వ ఆర్ట్స్ మన కళాక్షేత్రం ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో వెంకటేష్‌కు ప్రముఖ నటుడు, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రంజిత్, తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం

కందనూలు: జిల్లా కేంద్రంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని నిర్వహించారు. బాలుర జూనియర్ కళాశాల నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటరమణ, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం పాల్గొన్నారు.

దాడి చేసినవారిని శిక్షించాలి

తిమ్మాజీపేట: మండలంలోని చేగుంటలో క్షుద్ర పూజలు చేశారనే కారణంతో గడ్డం కృష్ణయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, డిమాండ్ చేశారు. సోమవారం గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు.

దళితులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

తాడూరు: దళితులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. సోమవారం మండలంలోని సిర్సవాడలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, భగవంత్, రమేష్, పరశురాం, తదితరుల పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటిలో చేపట్టే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై వార్డు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహ్మదీషేక్ అన్నారు. సోమవారం మండలంలోని రఘుపేటలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ వార్డు ఆఫీసర్లకు క్షేత్రస్థాయి పర్యటన చేసి పలు సూచనలు చేశారు. ఇంటి నిర్మాణాలు, కొలతలు, తదితర అంశాలను వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ నమోదు, మార్కింగ్ అంశాలను వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై చెంచులకు అవగాహన



మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని అటవీ లోతట్టు ప్రాంతాలు కొల్లం, కొమ్మెనపెంట చెంచు గ్రామాలలో మిషన్ ఇంద్ర ధనుస్సు మూడో రౌండ్‌లో భాగంగా సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్ననూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం జ్వరం, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మందులు అందజేశారు. చిన్నారులకు వ్యాక్సిన్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మార్తమ్మ, చంద్రకళ, భారతి, ఏఎన్‌ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

లింగాల: పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ యువకులు మల్లె ప్రశాంత్, బళ్లారి సంతోష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను గ్రామానికి చెందిన పలువురు యువకులు సందర్శించి సమస్యల ను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు రావాలని, సమస్యలను విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కంప నరేష్, నరేశ్వరం, చిరంజీవి, వెంకటేష్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

తాడూరు: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ వనజ అన్నారు. మండలంలోని చర్లఇటిక్యాల పాఠశాల ఆవరణంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి చిన్నారులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు.